# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 341 | సోమవారం 19 ఆగస్టు 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## ప్రజలకు చేరువగా సర్కారు



- రేవంత్‌రెడ్డి 250 రోజుల పాలనపై సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించిన ఆ సంస్థ
- 72 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు
- మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనపై సానుకూలంగా స్పందించారు
- ప్రధానంగా కలిసోచ్చిన్న మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎ.రేవంత్ రెడ్డి తన పాలనకు 250 రోజులు పూర్తిచేసుకున్నారు. ఐదు సంవత్సరాల పరిపాలనా కాలంలో 250 రోజులు అంటే తక్కువ సమయమే అయినప్పటికీ కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడం, మరికొన్ని పథకాల అమలు నెమ్మదిగా జరుగుతుండటంతో ప్రజలు ఏమనుకుంటున్నారు? ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరు ఎలా ఉంది? అనే అంశాలపై తెలంగాణలో ఓ సంస్థ సర్వే చేపట్టింది. - మిగతా3లో

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలే!

- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ కేంద్రం
- ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం



## కాళేశ్వరంపై విచారణ వేగవంతం



- 2 వారాల పాటు విచారణ
- జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్
- ఇప్పటికే, కాళేశ్వరంలోని వివిధ బ్యారేజీలను స్వయంగా పరిశీలించిన కమిషన్
- విచారణలో భాగంగా అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు సమన్లు జారీ

హైదరాబాద్

ఏం చేసినా ఈ నెలాఖరులోపే. కాళేశ్వరంలో అవినీతిపై అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ పిలిపించడానికి.. మిగిలింది ఇంకో రెండు వారాలే. బహుశా ఈ వారంలో కొన్ని సంచలనాలు కూడా ఉంటాయంటున్నారు. కీలక వ్యక్తులతో పాటు - మిగతా3లో

## తూతూమంత్రంగా రుణమాఫీ



- రుణమాఫీతో రైతులను నట్టేట ముంచింది
- రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే కాంగ్రెస్‌పై పోరాడతాం..
- రాహుల్, ఖర్గేకు కేటీఆర్ లేఖ
- కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం
- మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలి

హైదరాబాద్

తెలంగాణలో రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీ అందని లక్షలాది మంది రైతుల తరపున ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఆ లేఖలో పొందుపరిచారు. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకు రెండు లక్షల రుణమాఫీ హామీ ఇచ్చారు.. కానీ ఈ ప్రభుత్వం - మిగతా3లో

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

వ్యాను, బస్సు ఢీ.. పదిమంది దుర్మరణం

మరో 27 మందికి తీవ్ర గాయాలు

మృతులంతా అలీగఢ్ జిల్లాకు చెందిన కార్మికులు

## అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలకు అస్వస్థత



- మందు చల్లే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, వేసవిని తలపిస్తున్న ఎండలకు కూలీలంతా అస్వస్థత
- బాధితులను పరీక్షించిన చికిత్స అందించిన వైద్యులు
- ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కల్లూరు వైద్యులు వెల్లడి

## త్వరలోనే రైతులందరికీ రుణమాఫీ

- రాష్ట్ర రాజధానిలో జరిగిన పలు సమీక్షల్లో పరకాల అభివృద్ధిపై చర్చించాం
- టెక్స్‌టైల్ పార్కును దేశంలోనే రోమ్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆలోచనలో ఉంది
- గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర చెల్లించి అండగా ఉంటాం
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వరంగల్

రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణమాఫీకి రూ.19వేల కోట్ల నిధులు మంజూరు చేశామని, మరో రూ.12వేల కోట్లు త్వరలోనే మంజూరు చేసి త్వరలోనే రైతులందరికీ రుణమాఫీని పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ - మిగతా3లో



## రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

- ముఖ్యమంత్రి సిద్దరాయమ్యను విచారించేందుకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గ్లహోత్ అనుమతి
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమం శాంతియుతంగా జరగాలి
- ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదు
- పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సూచన

## బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ

- బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై బండి సంజయ్ హాట్ కామెంట్స్..
- కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉంది
- ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉంది
- అవినీతి పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదు
- రుణమాఫీ సహా 6 గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకే ఈ విలీన డ్రామాలు



హైదరాబాద్

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ వ్యవహారంపై హాట్ హాట్ కామెంట్స్ చేశారు. విలీనం, పొత్తులు గంగలో కలవనీయండని అన్నారు. వాటితో ప్రజలకేం సంబంధం? అని అన్నారు. ఇదే అంశంపై ఇటీవల విపరీతమైన ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం నాడు మీడియాతో మాట్లాడారు కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్. బీఆర్ఎస్‌పై, ఆ పార్టీ అగ్ర నేతలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ అవుట్ - మిగతా3లో

# మీకిది తగునా?

**కోల్ కతా:** కోల్ కతా ట్రైనీ డాక్టర్ మృతిపై ఆందోళనలు మిన్నంటాయి. వైద్యురాలి పేరంట్స్ మీడియా ముందుకు వచ్చారు. పశ్చిమ బెంగాల్ సర్కార్ తీరును తప్పు పట్టారు. సీఎం మమతా బెనర్జీ (%మీఖిఎఖీ దీఖిఅవతీయవవ%) ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని విరుచుకుపడ్డారు. తమ బిడ్డ మృతికి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

**బానే మాట్లాడారు.. కానీ..?**

'నా బిడ్డ చనిపోవడంతో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వీధుల్లోకి వచ్చి చాలా బాగా మాట్లాడారు. నా బిడ్డ మృతికి న్యాయం జరగాలని ఆందోళన కూడా చేపట్టారు. అదే సమయంలో ప్రజల ఆగ్రహాన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎందుకు ద్వంద్వ విధానం అమలు చేస్తున్నారు. ప్రజలను చూస్తే మీకు భయం వేస్తోందా..? ఇదే అంశంపై నాకు పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది. నా బిడ్డ చనిపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. న్యాయం కోసం అందరూ రోడ్లమీదకొచ్చారు. వారిని అడ్డుకునే ప్రయత్నంలో బెంగాల్ ప్రభుత్వం ఉంది. స్వేచ్ఛగా నిరసన చేస్తోన్న వారి గొంతును మమతా బెనర్జీ అడ్డుకుంటున్నారు. బెంగాల్ సీఎం రోడ్డుమీదకొస్తే ఇతరుల నిరసనలు చూసేందుకు ఇష్టపడటం లేదేమో అని' మృతురాలి తండ్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**మీరు ఆలోచించండి..**

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీరును బాధితురాలి తల్లి




కూడా తప్పు పట్టారు. 'కన్యశ్రీ, లక్ష్మీభాండర్ పథకాలు పొందుతున్న వారికి నేను చెబుతున్నది ఒక్కటే. ఆ పథకాలు సరే.. మీ భద్రత సంగతి ఏంటీ..? అలాంటి పథకాలతో ప్రయోజనం పొందుతారే తప్ప ఏ మాత్రం భద్రత ఉండదు. నా కూతురిని హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలి. ఆ తర్వాత మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పరిహారం తీసుకుంటాం అని' వైద్యురాలి తల్లి స్పష్టం చేశారు. కోల్ కతా ఆర్జీ కర్ ఆస్పత్రి సమీపంలో ఐదుగురు కంటే ఎక్కువ మంది సమావేశం కావొద్దని పోలీసులు స్పష్టం చేశారు. ఆ ఆదేశాలు అమల్లోకి వచ్చిన వెంటనే వైద్యురాలి తల్లి, తండ్రి మీడియాతో మాట్లాడారు. పశ్చి బెంగాల్ సర్కార్ అనుసరిస్తోన్న తీరును ఎండగట్టారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

**బెంగళూరు :** మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరాయమ్యను విచారించేందుకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గ్లహెూత్ అనుమతి ఇవ్వడంపై అధికార కాంగ్రెస్ పార్టీ మండిపడ్డింది. ఆ క్రమంలో రేపు.. అంటే ఆగస్ట్ 19వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని శ్రేణులకు ఆ పార్టీ పిలుపునిచ్చింది.

డిప్యూటీ సీఎం డీకే కీలక నిర్ణయం.. ఆదివారం బెంగళూరులో కర్ణాటక డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నేతలతోపాటు కార్యకర్తలు సైతం పాల్గొనాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ ఆందోళన కార్యక్రమం శాంతియుతంగా జరగాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదన్నారు.

**పార్టీ శ్రేణులకు జాగ్రత్తలు చెప్పిన డిప్యూటీ సీఎం ..**

కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఈ ఆందోళనల్లో సంఘ విద్రోహక శక్తులు చొరబడే అవకాశముందని ఈ సందర్భంగా డిప్యూటీ డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ఈ ఆందోళనల్లో హింసాకు దారి తీసే పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆందోళనలు చాలా జాగ్రత్తగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రాలు...**



సీఎం సిద్దరామయ్యను విచారించాలంటూ గవర్నర్ గేహ్లాత్ నిర్ణయానికి వ్యతిరేకంగా.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పత్రాలు పంపాలన్నారు. అందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా, తాలుకా కేంద్రాల్లోని ఉన్నతాధికారులకు అందుకు సంబంధించిన వినతి పత్రాలు అందజేయాలని పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సూచించారు.

**సీఎం కూర్చి దింపేందుకు కుట్ర..**

సీఎం సిద్దరామయ్యను పదవి నుంచి దిప్పేందుకు జరుగుతున్న ఈ కుట్రకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని డీ కే శివకుమార్ స్పష్టం చేశారు. సిద్దరామయ్య ప్రభుత్వానికి వ్యతికరంగా భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జేడీ(ఎస్)లు కుట్రపూరితంగా వ్యవహరిస్తు న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సిద్దరామయ్యను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ, జేడీ(ఎస్)తో పాటు కర్ణాటకలోని స్థానిక నేతలు ఒక తాటికిపైకి వచ్చి కుట్రకు తెర తీశారని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు.

## బ్యాంకు సమస్యల కారణంగానే అజిత్ పవార్‌తో ఉన్నా ఎన్సీపీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు



ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీసీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. తనకున్న బ్యాంకు సమస్యల కారణంగానే అజిత్ పవార్ వెంట ఉన్నట్లు తెలిపారు. అయితే శరద్ పవార్‌ను తాను ఎప్పుడూ గౌరవిస్తానని ఆయన అన్నారు. శనివారం వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ఎన్సీపీ ఎమ్మెల్యే రాజేంద్ర షింగ్నే పాల్గొన్నారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌తో కలిసి వేదికను పంచుకున్నారు. కాగా, ఎన్సీపీ ఎమ్మెల్యే రాజేంద్ర షింగ్నే ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. శరద్ పవార్‌ను తాను ఎప్పుడూ గౌరవిస్తానని ఆయన అన్నారు. 'నా జిల్లా సహకార బ్యాంకు (బుల్దానాలో) ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిస్సహాయత కారణంగా నేను అజిత్ దాదా (అజిత్ పవార్)తో కలిసి ప్రభుత్వం వైపు వెళ్లాల్సి వచ్చింది. ఈ రోజు ప్రభుత్వం నుంచి జిల్లా సహకార బ్యాంకు రూ. 300 కోట్లు పొందింది. కానీ పవార్ సాహెబ్ (శరద్ పవార్) నాకు ఎల్లప్పుడూ గౌరవనీయులు' అని అన్నారు. మరోవైపు ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఎంవీఏ కూటమి విజయంతో ఎన్సీపీ నేతలు ఇప్పటికే శరద్ పవర్ శిబిరంలో చేరుతున్నారు. అజిత్ పవార్ వెంట ఉన్న మరికొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు బహిరంగంగానే శరద్ పవార్‌కు మద్దతిస్తున్నారు.

# రాజ్యాంగంపై దాడి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోదీ రాజ్యాంగంపై, రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేస్తున్నారని అన్నారు. ఉన్నత ఉద్యోగాల్లో లేటరల్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగా నియామకం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కాకుండా.. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వారా జరుగుతోందని ఆరోపించారు. అత్యున్నత బ్యూరోక్రసీ వ్యవస్థతో పాటు దేశంలోని అన్ని అత్యున్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేదని తాను ఎప్పటినుంచో చెబుతూ వస్తున్నానని, ఆ వ్యవస్థను మెరుగుపరచడానికి బదులు, లేటరల్ ఎంట్రీ ద్వారా అణగారిన వర్గాలకు అత్యున్నత స్థానాల్లో చోటులేకుండా చేస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేటరల్ విధానం యుపిఎస్సికి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన ఎంతోమంది యువత హక్కులను దోచుకునేలా ఉందన్నారు. ఈ విధానాన్ని అణగారిన వర్గాలకు చెందాల్సిన రిజర్వేషన్లను లాక్కోవడంతో పాటు సామాజిక న్యాయంపై దాడిగా రాహుల్ పేర్కొన్నారు.

ఆ విధానానికి వ్యతిరేకం-రాహుల్ గాంధీ

లేటరల్ విధానం ద్వారా కేంద్రప్రభుత్వం ఐఏఎస్‌లను ప్రైవేటీకరిస్తుందని ఆరోపించారు. రిజర్వేషన్లను అంతం చేయడానికి ఇది మోదీ ఇచ్చిన హామీగా పేర్కొన్నారు. కీలకమైన ప్రభుత్వ పదవుల్లో బయట వ్యక్తులను కూర్చోబెట్టడం ద్వారా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఎలాంటి దోపిడీ చేస్తారో చెప్పడానికి సెబీ ఉదాహరణ అని రాహుల్ గాంధీ తెలిపారు. ప్రయివేట్ రంగం నుండి



వచ్చిన వ్యక్తిని మొదటిసారి చైర్‌పర్సన్‌గా నియమించారని ఆయన అన్నారు. ఇలాంటి చర్యల కారణంగా పరిపాలనా నిర్మాణం, సామాజిక న్యాయం రెండూ దెబ్బతింటున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

నిరసనలకు అఖిలేష్ పిలుపు..

యూపీఎస్సీలో లేటరల్ విధానాన్ని సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీలు వ్యతిరేకించాయి. ఈ పథకానికి వ్యతిరేకంగా అక్టోబర్ 2న పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేయడాన్ని సహించబోమన్నారు. మరోవైపు బీఎస్పీ చీఫ్ మాయావతి సైతం లేటరల్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ప్రస్తుతం ఉన్న అధికారులతో పాటు యువత భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకాశాలు లేకుండా చేస్తుందని మాయవతి పేర్కొన్నారు. 45 ఉన్నత ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నిర్ణయం సరికాదన్నారు. ఎలాంటి నియమాక ప్రక్రియ లేకుండా ఖాళీలను భర్తీ చేయడం సరికాదని.. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాయావతి పేర్కొన్నారు.

## అమెరికాలో తెలుగు సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి

అమెరికాలో ఐటీ ఇంజినీర్ గా పనిచేస్తున్న ఏపీకి చెందిన బుచ్చిబాబు ప్రమాదవశాత్తు మరణించారు. బుచ్చిబాబు వయసు 40 సంవత్సరాలు. బుచ్చిబాబు స్వస్థలం ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామం. కాలిఫోర్నియాలోని ఓ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్న బుచ్చిబాబు వారాంతం సెలవుల్లో కుటుంబంతో కలిసి బీచ్ కు వెళ్లరు. అయితే అలల తీవ్రత కారణంగా సముద్రంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. బుచ్చి బాబు మృతితో అతడి కుటుంబం తల్లడిల్లుతోంది. బుచ్చిబాబు తల్లిదండ్రుల గుండె కోతతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్వగ్రామం ముండ్లమూరు గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, బుచ్చిబాబు మృతదేహాన్ని భారతకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఇటీవలకాలంలో భారతీయ విద్యార్థులు, వృత్తి నిపుణులు విదేశాల్లో మరణిస్తున్న ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి.

## వినీలాకాశంలో కనువిందు చేయనున్న సూపర్ బ్లూమూన్!



వినీలాకాశంలో ఓ అరుదైన దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. సోమవారం సూపర్ బ్లూ మూన్ ఆవిష్కృతం కాబోతున్నది. సాధారణంగా ఒక ఏడాదిలో రెండు, మూడు సూపర్ మూన్స్ ఏర్పడుతుంటాయి. బ్లూ మూన్ మాత్రం అరుదుగా ఏర్పడుతుందని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా పేర్కొంది. అయితే, ఈ సారి మాత్రం సూపర్ మూన్, బ్లూ మూన్ కలయికలో సూపర్ బ్లూ మూన్ దర్శనం ఇవ్వబోతున్నది. పౌర్ణమి గడియల్లో చందమామ 90శాతం భూమికి దగ్గరగా వచ్చిన సూపర్ మూన్ ఆవిష్కృతమవుతుంది. దాంతో సాధారణంగా పౌర్ణమి రోజుల కంటే సూపర్ మూన్ సమయంలో చంద్రుడు మరింత ప్రకాశవంతం ఉండడంతో పాటు భారీ పరిమాణంలో కనిపిస్తాడు. నాలుగు పౌర్ణమిలలో మూడో పౌర్ణమి రోజున బ్లూ మూన్ ఏర్పడుతుంది. అయితే, బ్లూ మూన్ అంటే నీలం రంగులో మాత్రం కనిపించదు. కానీ, సాధారణంగా బ్లూ మూన్ అని పిలుస్తుంటారు. సూపర్ మూన్, బ్లూ మూన్ రెండూ ఒకేసారి రావడం అరుదుగా జరుగుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ సారి సూపర్ బ్లూ మూన్ అనేది భారతీయులకు ఎంతో ముఖ్యమైన రాఖీ పండుగ రోజున రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, 1979లో రిచర్డ్ నోల్లెచే సూపర్ మూన్ అనే పదాన్ని పరిచయం చేశారు. 2024లో వరుసగా సూపర్ మూన్‌లు ఆవిష్కరం కాబోతున్నాయి. ఇందులో రాఖీ పండుగ రోజున ఒకటి దర్శనం ఇవ్వనుండగా.. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లోనూ సూపర్ మూన్‌లో కనిపించనున్నాయి. పౌర్ణమి రోజు 25శాతం సూపర్ మూన్‌లు ఏర్పడితే 3శాతం మాత్రమే బ్లూ మూన్స్ ఆవిష్కృతమవుతాయి. ఇక ఈ రెండింటి కలయికలో ఇంకా అరుదుగా వస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మళ్లీ సూపర్ మూన్, బ్లూ మూన్ రెండింటి కలయికలో 2037 సంవత్సరంలో దర్శనం ఇచ్చే అవకాశం ఉందని అంచనా. నాసా ప్రకారం అప్పుడప్పుడు పొగ, ధూళి తదితర చిన్న చిన్న కణాలు కాంతి ఎరుపు తరంగ ధైర్ఘ్యాలను చెదరగొడుతుంటాయి. దాంతో చంద్రుడు నీలం రంగులో కనిపిస్తాడు.

## ప్రభుత్వ స్కూల్‌లో బిస్కెట్లు తిన్న విద్యార్థులు.. 80 మంది ఆసుపత్రిపాలు



**ముంబై:** ప్రభుత్వ స్కూల్‌లో బిస్కెట్లు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు కావడంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుగురు విద్యార్థుల పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ఉదయం కేకేట్ జల్గావ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార భోజన పథకం కార్యక్రమంలో భాగంగా బిస్కెట్లు ఇచ్చారు. అవి తిన్న తర్వాత వికారం, వాంతులతో విద్యార్థులు అస్వస్థత చెందారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు, ఇతర అధికారులు వెంటనే ఆ పాఠశాలకు చేరుకున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వారిని గ్రామీణ ఆసుపత్రికి తరలించారు. బిస్కెట్లు తిన్న తరువాత స్కూల్‌లోని 257 మంది విద్యార్థుల్లో ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపించాయని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ బాబాసాహెబ్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు 153 మంది బడి పిల్లలను ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు చెప్పారు. మరోవైపు చికిత్స తర్వాత పలువురు విద్యార్థులను వారి ఇళ్లకు పంపేశారు. సుమారు 80 మందికి గ్రామీణ ఆసుపత్రిలో చికిత్స అందించారు. తీవ్ర లక్షణాలున్న ఏడుగురు విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఫుడ్ పాయిజనింగ్ కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఉత్తరప్రదేశ్ లోని బులంద్ షహర్ జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. కార్మికులను ఇళ్లకు తీసుకెళుతున్న పికప్ వ్యాను, ఓ ప్రైవేటు బస్సు ఢీ కొన్నాయి. దీంతో ఫ్యాక్టరీ కార్మికులు పదిమంది అక్కడికక్కడే చనిపోయారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బులంద్ షహర్ లోని ఓ ఫ్యాక్టరీకి చెందిన కార్మికులను పికప్ వ్యాన్ ఆదివారం ఇళ్లకు తీసుకెళుతోంది. సేలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న ఒక ప్రైవేట్ బస్సు కార్మికుల పికప్ వ్యాన్ ను బలంగా ఢీ కొట్టింది. దీంతో పికప్ వ్యాన్ లోని పదిమంది కార్మికులు స్పాట్ లోనే చనిపోయారు. మరో 27 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వారిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా అలీగఢ్ జిల్లా రాయ్ పూర్ ఖాస్ అహిర్ నాగ్లా గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ చంద్రప్రకాశ్ సింగ్, ఎస్ఎస్పీ శ్లోక్ కుమార్ జిల్లా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

# తూతూమంత్రంగా రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. 40 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అని చెప్పి కేవలం 17 వేల కోట్ల రుణమాఫీతో రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలని తన లేఖలో డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరఫున కాంగ్రెస్ పార్టీపై పోరాడతామని ఆ లేఖ ద్వారా హెచ్చరించారు.

**కేటీఆర్ లేఖ యథాతథంగా..**

గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారు, మల్లికార్జున ఖర్గే గారికి

మీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్వాకం వలన దగా పడిన లక్షలాది మంది తెలంగాణ రైతుల తరఫున మీకు ఈ లేఖ రాస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఫల్యాలతో ముఖ్యంగా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న రైతు రుణమాఫీ మోసం వలన లక్షలాదిమంది రైతులు తీవ్రమైన ఆవేదనలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట మీరు విడుదల చేసిన హామీలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ అనేది అత్యంత కీలకమైన అంశం అనే విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

అబద్ధాలు, అభూతకల్పనలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన సీఎం రేవంత్.. మూడు విడతలుగా మోసంచేస్తూ.. ఎనిమిది నెలలుగా ఊరించి ఊరించి చివరికి రైతులను ఉసూరుమనిపించారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం. అందుకే తెలంగాణలో రుణమాఫీ పేరిట జరిగిన నయవంచనకు సంబంధించిన లెక్కలు మీకు తెలుసో లేదో అనే ఉద్దేశంతో సీఎం చెప్పిన అబద్ధాలు,



క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఈ లేఖలో పొందుపరుస్తున్నాను.

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయింది. ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ది చేకూరింది. కాంగ్రెస్ చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెరగాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనం. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి తూతూమంత్రంగా చేయడం.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. అసలు లక్ష రూపాయల రుణమాఫీ కన్నా.. రెండు లక్షల రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం రైతు రుణమాఫీ ఏ మేరకు విఫలమైందో అద్దం పడుతుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం రెండు లక్షల రుణమాఫీకి 49,500 కోట్లు అంచనా వేశారు. ముఖ్యమంత్రే స్వయంగా రుణమాఫీకి 40వేల కోట్ల వరకు అవుతుందని తొలుత చెప్పుకొచ్చారు. కడుపు కట్టుకుంటే.. ఇది పెద్ద విషయం కాదని ఇంటర్వ్యూల్లో గొప్పలు చెప్పారు. చివరికి రాష్ట్ర కేబినెట్ సమావేశం వరకు వచ్చే సరికి 31 వేలకు దీన్ని కుదించారు. కనీసం అంతమేరకైనా చేశారా అంటే అదీ లేదు. రాష్ట్ర బడ్జెట్ లో మరింత కోత పెట్టి 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు. 49,500 కోట్ల రూపాయల రెండు లక్షల రుణమాఫీ కాస్తా.. మూడు విడతల్లో దాదాపు మూడింతలు తగ్గి 17,933 చేరింది. 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా.. లక్షలాది మంది రైతులను నట్టేట ముంచి ప్రక్రియ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేయడంతో.. యావత్ తెలంగాణ ఇవాళ రైతుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారు. మంచిర్యాలలో రుణమాఫీ కాలేదని మనస్థాపం చెంది ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. అటు కరీంనగర్ రాజీవ్ రహదారిపై అన్నదాతలు రాస్తారోకో నిర్వహించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మొలంగూరులోని ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి నిరసన చేపట్టారు. వనపర్తిలో రైతువేదిక సాక్షిగా రుణమాఫీ కాని రైతులు అబద్ధాల ముఖ్యమంత్రికి పాలించే హక్కు లేదని నిలదీశారు. ఇటు జగిత్యాలలో రుణమాఫీ కాలేదని కెనెరా బ్యాంకు ముందు పెద్దఎత్తున ధర్నాకు దిగారు. ఇలా ఒకటా రెండు%ౌ% రుణమాఫీ కాని అన్నదాతల ఆందోళనలతో యావత్ తెలంగాణ అట్టుడుకుతోంది. దేవుడి మీద ఓట్ల పెట్టి మరీ మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం ఆగ్రహంతో ఊగిపోతోంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో అప్పుల భారం భరించలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అడ్డగోలు ఆంక్షలు..అర్థంలేని షరతులతో ఒక ప్రహసనంగా మార్చిన రుణమాఫీని రైతులందరికీ పూర్తిచేయాలి. రైతు రుణమాఫీకి సంబంధించి మా పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ కి కేవలం వారం రోజుల వ్యవధిలోనే 1,20,000 కు పైగా ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. రైతులను నిలువునా మోసం మోసం చేసిన ఈ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తన వైఖరి మార్చుకొని రాష్ట్రంలోని అన్నదాతలందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రాష్ట్రంలోని అన్నదాతల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అప్పటివరకు తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటం చేస్తామని తెలియజేస్తున్నాను.

# కాళేశ్వరంపై విచారణ వేగవంతం

-మొదటిపేజీ తరువాయి

కీలక ప్రజాప్రతినిధులకు కూడా నోటీసులు వెళ్తాయంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఎవరి పేరు గుర్తుకొస్తుందో.. వారికి కూడా సమన్లు వెళ్తాయా? వాళ్లు విచారణకు హాజరవుతారా

కాళేశ్వరం లిఫ్టుల్లో ఏమేం అక్రమాలు జరిగాయ్.. ఎంత అవినీతి జరిగింది.. నాణ్యతా లోపాలకు కారణాలేంటి, కారకులెవరు? వీటిని తేల్చేందుకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పటికే, కాళేశ్వరంలోని వివిధ బ్యారేజీలను కమిషన్ స్వయంగా పరిశీలించింది వచ్చింది. ప్రాజెక్ట్ కోసం పనిచేసిన ఇంజనీర్లను విచారించి.. అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణలో భాగంగా అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు సమన్లు జారీ చేసింది. అయితే.. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగుస్తుండడంతో.. ఆలోపే విచారణను ముగించేయాలనుకుంటోంది కమిషన్. ఎంక్వైరీని స్పీడప్ చేయాలనే ఉద్దేశంతో శుక్రవారమే హైదరాబాద్ వచ్చిన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్.. జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాష్‌ను విచారించారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టాలనే ఆలోచన మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్నప్పటికీ.. మహారాష్ట్ర ఒప్పుకోలేదని కమిషన్‌కు వివరించారు వి.ప్రకాష్. సరిపడినంత స్టోరేజీ లేకపోవడం వల్లే తుమ్మిడిహట్టి నిర్మాణం ఆలోచన ముందుకు వెళ్లలేదని కమిషన్‌కు స్పష్టం చేశారు. పైగా సీడబ్ల్యూసీ చెప్పినట్లు 164 టీఎంసీల్లో 64 టీఎంసీలు తెలంగాణవి కాదనే విషయం రిపోర్టుల్లోనే ఉందన్న విషయాన్ని కూడా కమిషన్‌కు గుర్తు చేశారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత 54 టీఎంసీలే



ఉంటుందని అన్ని ఆధారాలు చూపించానన్నారు వి.ప్రకాష్. తెలంగాణ భవిషత్ కోసం తుమ్మిడిహట్టితో పాటు అన్ని ప్రాజెక్టులను మాజీ సీఎం కేసీఆర్ రీ-డిజైన్ చేశారని కమిషన్ ముందు చెప్పానన్నారు. ఈనెల 26న సాక్ష్యాలతో సహా మరోసారి కమిషన్ ముందు హాజరవుతానన్నారు.

ఈ నెలాఖరులోగా రిపోర్ట్ సమర్పించేందుకు రెడీ అవుతోంది కమిషన్. అంతకంటే ముందు గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కొందరు ప్రజాప్రతినిధుల పాత్రపై కమిషన్‌కు అనుమానాలున్నాయి. అనుమానాల నివృత్తి కోసం.. కొందరు అధికారులు, ఇంజినీర్లు, ప్రైవేట్ వ్యక్తులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలనుకుంటోంది కమిషన్. ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణ విషయంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను విచారించిన కమిషన్.. వాళ్ల నుంచి ఇప్పటికి 50కిపైగా అఫిడవిట్లు రాబట్టింది. కానీ ఇంతవరకూ మాజీ సీఎస్ సోమేష్ కుమార్ మాత్రం అఫిడవిట్ సమర్పించలేదు. ఆయనతోపాటు స్పందించని మరికొందరు అధికారులకు రేపోమాపో నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై నివేదిక ఇవ్వాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఏజెన్సీ ఛైర్మన్‌ను కోరింది. వాళు కూడా రిపోర్ట్ సబ్‌మిట్ చేయకపోవడంతో నోటీసులు ఇవ్వాలనే ఆలోచనలో చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఇక అఫిడవిట్లు సమర్పించిన అధికారులను సైతం మరోసారి పిలిపించి.. క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది కమిషన్. మొత్తంగా ఈ నెలాఖరు నాటికి కాళేశ్వరంపై విచారణను ముగించే లక్ష్యంతో పనిచేస్తోంది.

## త్వరలోనే రైతులందరికీ రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని నూతన మున్సిపాలిటీ భవనంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్యతో కలిసి అమృత్ పథకం-2లో భాగంగా రూ. 11.74కోట్లతో పలు అభివృద్ధి పనులు, రూ.5కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. రాష్ట్ర రాజధానిలో జరిగిన పలు సమీక్షల్లో పరకాల అభివృద్ధిపై చర్చించామన్నారు. టెక్స్‌టైల్ పార్కును దేశంలోనే రోల్ మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆలోచనలో ఉందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర చెల్లించి అండగా ఉంటామని, భూ సేకరణ పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజలకు చేరువగా సర్కారు

-మొదటిపేజీ తరువాయి

20 జిల్లాల్లో అభిప్రాయాలు రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి పదోతేదీ వరకు ప్రజల అభిప్రాయాలను ఆ సంస్థ సేకరించింది. ఇందులో 72 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనపై సానుకూలంగా స్పందించారని, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరు చాలా బాగుందని, ప్రజలకు బాగా దగ్గరైన ముఖ్యమంత్రిగా ఆయన పేరు తెచ్చుకున్నారని సర్వే సంస్థ వెల్లడించింది. పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రధానంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మాత్రం ఎక్కువ మార్కులు పడ్డాయి.వెంటనే స్పందించడం కలిసొస్తోంది నిరాడంబరంగా ఉండటం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు ఏ విషయంపైనా వెంటనే స్పందించడంతోపాటు ప్రభుత్వం తరఫున, పార్టీ తరఫున బలమైన గళం వినిపిస్తుండటం రేవంత్ రెడ్డికి సానుకూల అంశాలయ్యాయి. రైతు రుణమాఫీ బాగా కలిసివచ్చింది. ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగం కాంగ్రెస్ సర్కారువైపే మొగ్గుచూపింది. విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి సానుకూలతే నమోదైంది. ఆడంబరాలకు దూరంగా ఉండటం ప్రస్తుత ప్రభుత్వానికి బాగా



కలిసివచ్చింది.

ఆర్టీసీ ఎంతో మేలు చేసింది రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజ్ ను రూ.10 లక్షలకు పెంచడం, అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం.. ఈ రెండు అంశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చిందని సర్వే సంస్థ పేర్కొంది. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే ప్రజల నుంచి భారీ మద్దతు దొరకడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు తమ ప్రభుత్వానికి మంచి మార్కులు వచ్చేలా చేశాయన్నారు.

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలే!



రాగల ఐదురోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో నైరుతి దిశగా వంగి ఉందని తెలిపింది. ఉపరితల ఆవర్తనంపై నుంచి ద్రోణి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, తెలంగాణను ఆనుకొని ఉన్న ఆగ్నేయ ఆరేబియా సముద్రం మీదుగా కేరళగుండా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్లు విస్తరించి ఉందని తెలిపింది. ఆదివారం నుంచి సోమవారం ఆదిలాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం పేర్కొంది.

## బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ

-మొదటిపేజీ తరువాయి



డేటెడ్ పార్టీ అని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందన్నారు. అవినీతి పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదన్నారు.

ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక రైతులు కాంగ్రెస్ దిష్టి బొమ్మలు కాల్చేస్తున్నా పట్టించుకోరా? అని కేంద్రమంత్రి బండి సంజయ్ నిలదీశారు. రుణమాఫీ సహా 6 గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకే ఈ విలీన డ్రామాలను తెరమీదకు తీసుకువస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న డ్రామా ఇది అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. ఎన్నికల్లో రూ. 40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు కేటాయించి.. చివరకు రూ. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేస్తారా? అని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసాలకు ప్రజలకు అర్థమయ్యాయని తెలిసే ఈ విలీన డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కాగా, గత రెండు రోజుల నుంచి బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని కాంగ్రెస్ నేతలు.. లేదు లేదు కాంగ్రెస్‌లోనే బీఆర్ఎస్ విలీనం అవుతుందని బీజేపీ నేతలు వరుస ప్రకటనలు చేస్తూ పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నారు. మరోవైపు.. చిల్లర ప్రచారాలు మానుకోవాలంటూ బీఆర్ఎస్ ముఖ్య నేతలు వార్నింగ్ ఇస్తున్నారు. మరి ఎవరి ప్రకటన ఎంత నిజమనేది తెలియాలంటే ఎదురు చూస్తూ ఉండాల్సిందే.

## వారి ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత: కేటీఆర్..

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్ట పాలన చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్(%ఖు=%) ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా మండిపడ్డారు. రాష్ట్రం ప్రభుత్వం వేతనం చెల్లించకపోవడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వసీం ఆత్మహత్య చేసున్నారంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన సూసైడ్ నోట్, సహా బాధితుడి ఫొటోలను కేటీఆర్ ట్వీట్‌కు జోడించారు. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థంకాక వసీం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తారీకునే జీతాలు చెల్లిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తోందని, అది పచ్చి అబద్ధమని చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని కేటీఆర్ రాసుకొచ్చారు. వసీం మృతికి ఇప్పుడు బాధ్యులు ఎవరంటూ ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు.

## అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలకు అస్వస్థత..




**ఖమ్మం:** తల్లాడ మండలం అన్నారుగూడెంలో 9మంది రైతు కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పొలంలో మందు చల్లుతూ తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో వారంతా అస్వస్థతకు లోనయ్యారు. బాధితులను హుటాహుటిన కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నూతనకల్‌కు చెందిన వీరంతా పనుల నిమిత్తం అన్నారుగూడెం వెళ్లారు. అయితే మందు చల్లే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, వేసవిని తలపిస్తున్న ఎండలకు కూలీలంతా అస్వస్థతకు గురయ్యారు. బాధితులను పరీక్షించిన వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కల్లూరు వైద్యులు వెల్లడించారు. అయితే రైతులు, రైతు కూలీలు పొలాల్లో మందు కొట్టే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒంటిపై మందు పడకుండా శరీరం మ్మొత్తం ప్రత్యేకమైన వస్త్రాలతో కప్పుకోవాలని చెప్తున్నారు. అలాగే శ్వాస ద్వారా మందు లోపలికి వెళ్లి కళ్లు తిరగడం, వాంతులు లేదా తల తిరగడం వంటి సమస్యల బారిన పడే అవకాశం ఉందని, కాబట్టి ముక్కు ద్వారా మందు లోపలికి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# దుర్గయ్య హ్యాట్సాఫ్...

**కరీంనగర్ :** సమాజంలో ఎంతోమంది సమాజ సేవకులను చూసే ఉంటాం. రకరకాల సేవా సంస్థల పేరుతో సమాజంలో నిరుపేదలకు సహాయం చేసేందుకు నిత్యం ఏదో ఒక రకమైన కార్యక్రమం పేరుతో కొంతమంది సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజ సేవ అంటే జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం లేక సైకిళ్లను పంచి పెట్టడం లేదా దుస్తులను పంచిపెట్టడం చేస్తుంటారు. ఇలాంటివన్నీ కూడా సామాన్యం గా ఏవైనా స్వచ్ఛంద సేవా సంస్థలు లేక మధ్యతరగతి పై కుటుంబాలు ధనిక కుటుంబాలు చేస్తుంటారు. అయితే ఇతను మాత్రం వీరందరిలా కాదు రోడ్లపై ఎక్కడైనా గుంతలు కనిపించాయంటే చాలు వెంటనే ఓ ఆటోలో మట్టిని నింపి తీసుకొచ్చి ఆ గుంతను పూడ్చేస్తారు. ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నాడు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్న ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలంటే మాత్రం ఈ స్టోరీ చదవాల్సిందే. కరీంనగర్ జిల్లా చొప్పదండి గ్రామానికి చెందిన అడ్లూరి దుర్గయ్య ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు సమాజసేవపై మక్కువ ఎక్కువ అందువల్లే రోడ్లపై ఎక్కడైనా చిన్న గుంత కనిపించింది అంటే చాలు వెంటనే తన ఆటోను తీసుకుపోయి ఓ గడ్డపార, ఓ పార సాయంతో తానే మట్టిని ఆటోలో నింపుకొని ఆ గుంతలను పూడ్చేస్తాడు. అయితే చొప్పదండి ధర్మారం ప్రాంతంలో క్వారీలు అధికంగా ఉండడం లారీలు తిరగడంతో రోడ్లు పూర్తిగా పాడవుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యల్లో ప్రయాణించే ఈ రోడ్డుపై నిరుపేదలు కూడా ప్రయాణిస్తుంటారు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు యోచిస్తుంటారు. అయితే తన కళ్ళ ముందు ఎన్నో ప్రమాదాలు చూసి తట్టుకోలేక పోయారు దుర్గయ్య. ప్రమాదాల్లో మరణించిన వారి పార్థివ దేహాలను కూడా కొంతమంది నిరుపేదలవి ఆయనే పూడ్చి పెట్టారట. వడ్లూరి దుర్గయ్య చొప్పదండి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆయనకు సంతానం ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ ఆటో నడుపుతూనే వారిని ప్రయోజకుల చేశారని గ్రామస్తులు తెలిపారు. అయితే చొప్పదండి చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడ గుంతలు కనిపించిన వాటిని తన సొంత ఖర్చుతో ఆ గుంతలను పూడుస్తారని ఎలాంటి లాభాన్ని ఆశించకుండా ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నారని అంటున్నారు గ్రామానికి చెందిన ప్రసాద్. ఎలాంటి లాభాన్ని ఆశించకుండా సమాజం కోసం తన వంతు సహాయంగా కృషి చేస్తున్న ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహించాలన్నారు. అయితే ఈ రోడ్లను పూడ్చడం ప్రభుత్వం పని అయినా తాను రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తన వంతు కృషి చేస్తున్నారని అంటున్నారు గ్రామస్తులు. గత 15 సంవత్సరాలుగా దుర్గయ్య చేస్తున్న సమాజ సేవను గుర్తించిన కొంతమంది సమాజ సేవకులు ఆయనను సన్మానిస్తున్నారు. అయితే ప్రస్తుతం దుర్గయ్య ఆటో పాడైపోయే స్థితిలో ఉంది, కావున ఎవరైనా దుర్గయ్యను ఆదుకోవాలని.. ఆయనను ఎవరైనా ఆదుకుంటే సమాజం కోసం కృషి చేస్తారని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. మరి మనం కూడా ఈ పెద్దాయన చేస్తున్న సేవకు ఒక హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

# ఉద్యమాలకు కేరాఫ్‌గా వరంగల్

**వరంగల్ :** ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న వరంగల్లో మరో ఉద్యమం మొదలవుతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్విభజన జరిగింది. అయితే వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించారు. నగరాన్ని ఏకం చేయాలనే ఉద్యమం మొదలైంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 అక్టోబర్ 11వ తేదీన అప్పటి ప్రభుత్వం వరంగల్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాల్ పల్లి జనగామ జిల్లాలుగా పునర్వి భజన జరిగింది. వరంగల్ నగరంతో పాటు కరీంనగర్, వరంగల్ సరిహద్దు ప్రాంతాలను కలుపుకొని వరంగల్ అర్బన్ జిల్లాగా ఏర్పాటు అయింది. వరంగల్ కార్పొరేషన్ పరిధితో పాటు చుట్టుపక్కల గ్రామాలు వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో కొనసాగాయి. 2021వ సంవత్సరంలో మరోసారి జిల్లాల చేర్పులు మార్పులు చేసి వరంగల్ అర్బన్ ను హన్మకొండగా, వరంగల్ రూరల్ ను వరంగల్ జిల్లాగా మార్చారు. కాకతీయు ల రాజధాని వరంగల్ అనగానే త్రినగరి గుర్తుకొస్తుంది. హనుమకొండ, వరంగల్, కాజీపేటలను కలుపుకొని వరంగల్ ను త్రినగరిగా పిలుస్తారు. చారిత్రక కట్టడాలు, అనేక ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు జిల్లా, ప్రాంతీయ కార్యాలయాలకు వరంగల్ నగరం నిలయం. 2016 అక్టోబర్ 11వ తేదీన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వరంగల్ నగరాన్ని వరంగల్ అర్బన్ జిల్లాగా మార్చారు. దీంతో వరంగల్ నగర అస్తిత్వానికి వచ్చిన ప్రమాదం ఏమీ లేదు సిటీ అంతా ఒకే పరిధిలో ఉండడంతో అందరూ హ్యాపీగా ఫీలయ్యారు.జిల్లాల మార్పులు చేర్పు?ల్లో భాగంగా 2021 ఆగస్టు 21న వరంగల్ అర్బన్ జిల్లాను హన్మకొండ జిల్లాగా మార్చడం జరిగింది. పేరు మార్పుతో వచ్చిన సమస్యే లేదు. కానీ వరంగల్ నగరం మొత్తం వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఉండేది. అర్బన్ పేరు మార్పుతో పాటు నగరాన్ని రెండు ముక్కలుగా చేసి హనుమకొండ జిల్లాగా.. వరంగల్ రూరల్ ను వరంగల్ జిల్లాగా మార్చారు. ఏకశిల నగరాన్ని రెండు ముక్కలు చేసి హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా చేసింది అప్పటి ప్రభుత్వం. దీంతో వరంగల్ అస్తిత్వానికి దెబ్బ పడింది.




శ్రీనగరిగా ఉన్న వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేయడంతో నగరవాసులతో పాటు మేధావులు విద్యావంతులు తీవ్రంగా వ్యతిరేకించారు కానీ ఫలితం లేదు. హనుమకొండ, కాజీపేట ప్రాంతంతో హనుమకొండ జిల్లాగా... వరంగల్ ప్రాంతం, హనుమకొండలోని కొత్త ప్రాంతాన్ని వరంగల్ జిల్లాగా ప్రకటించారు. దీంతో గ్రేటర్ వరంగల్ పరిధితో పాటు చారిత్రక ఏకశిల నగరం రెండు ముక్కలు ముక్కలైంది. చారిత్రక నగరానికి వచ్చే అథితులు, పర్యాటకులు ఇటు పోతే హనుమకొండ జిల్లా, అటుపోతే వరంగల్ జిల్లా ఏంటని ఆశ్చర్యానికి గురవుతున్నారు.వరంగల్ మహా నగరం అస్తిత్వం కోల్పోతుండడంతో వరంగల్ నగరం ఒకే జిల్లాగా ఉండాలనే పోరాటం మొదలైంది. మహానగరం ఏకీకరణ, పునర్నిర్మాణ కమిటీ పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించారు. నగర పరిధిలోని మేధావులు విద్యావంతులు మాజీ ప్రజాప్రతినిధులు కలిసి ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఈ ఉద్యమ కమిటీ లక్ష్యం త్రినగరిగా, ఏకశిల నగరంగా పేరున్న వరంగల్ నగరాన్ని ఒకే జిల్లా పరిధిలోకి తేవాలని వీరి పోరాటం. నగర పరిధిలోని మేధావులు, విద్యావంతులు, వ్యాపారులు, విద్యార్థులు, నగర పౌరులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మహానగర ఏకీకరణ కమిటీ ముందుకు వెళుంది.నగరం ఒకే జిల్లాలో ఉండడం వల్ల విద్యాపరంగా వ్యాపార పరంగా అభివృద్ధి చెందడంతో పాటు హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా వెలుగొందుతుందని కమిటీ సభ్యులు చెప్పారు ఏకీకరణ కోసం నగరంలో ఉన్న ప్రతి పౌరుని విద్యావంతుని మేధావుని మద్దతు తీసుకుంటున్నామని ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తామని కమిటీ భాద్యులు సంపత్ రెడ్డి, యాదవరెడ్డి, పెద్ది వెంకట్ నారాయణ చెప్పారు.

# తెర మీదకు సివిక్ వలంటీర్లు

**కోల్‌కత్తా :** ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన రాజ్యాంగాన్ని కలిగి ఉన్న దేశం మనది. నిలువెల్లా ప్రజాస్వామ్యస్ఫూర్తిని ప్రదర్శించే దేశం మనది. లౌకికత్వం, భిన్నత్వంలో ఏకత్వం వంటి విభిన్నతలను కలిగి ఉన్న భూ భాగం మనది.. అలాంటి మనదేశంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ప్రజలు ఓటు వేసి గెలిపించిన వారు అధికారులకు వస్తారు. ఐదు సంవత్సరాలపాటు ప్రజా సేవ చేస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. అధికారం దక్కిన తర్వాత ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి పూర్తిగా మారిపోతోంది. దోచుకోవడం, దాచుకోవడం పరిపాటిగా మారిపోతుం ది. గిట్టని వారిపై దాడులు చేయడం, నచ్చని వారి గొంతును నొక్కడం సర్వ సామాన్యమైపోతోంది. అంతేకాదు అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకునేందుకు పరిపాలకులు ఎంతటి దారుణానికైనా తెగిస్తున్నారు.. చివరికి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్నారు. వెనుకటికి రాజులు, చక్రవర్తులు, నియంతలు ఏర్పాటు చేసుకున్నట్లు.. సొంతంగా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే వీరికి ప్రభుత్వం నుంచే వేతనాలు ఇస్తుండ దంగ్ర్భాంతికి గురిచేస్తోంది. ఇక ప్రస్తుతం మన దేశంలో ఈ తరహా పరిపాలన సాగిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతుంది.. ఏపీలో 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో ఆయన జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. అవి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. దీంతో 2019 ఎన్నికల్లో ప్రజలు టిడిపికి అధికారాన్ని దూరం చేశారు. అదే సమయంలో 151 సీట్లతో వైసిపికి తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టారు. జగన్ కూడా వాలంటీర్ల పేరుతో ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. పింఛన్ల పంపిణీ నుంచి మొదలుపెడితే అనేక విధులను వారికి అప్పగించారు. వారు ఒక రకంగా అనధికారిక వైసీపీ కార్యకర్తలు లాగా పని చేశారు. వాలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నప్పటికీ.. చివరికి ఆ వ్యవస్థ జగన్మోహన్ రెడ్డికి 2024 ఎన్నికల్లో అధికారాన్ని దూరం



చేసింది. ఇక ఇప్పుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ సివిక్ వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఆ వ్యవస్థ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అనధికారిక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలకు మించి పని చేస్తోంది. కోల్ కతా లోని ఆర్ జీ కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన తర్వాత ఒకసారిగా ఈ సివిక్ వాలంటీర్ తెరపైకి వచ్చింది. దాని గురించి తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. దీనిపై అక్కడి ప్రతిపక్ష నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.సివిల్ వాలంటీర్లకు రాత పరీక్ష ఉండదు. ఇంటర్వ్యూ కూడా ఉండదు. వారిని ట్రాఫిక్ గార్డులుగా, పోలీస్ స్టేషన్లో వద్ద కాపలదారులుగా మాత్రమే నియమించినట్టు మమత ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన పండుగ సమయంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం, అనధికారికంగా పార్కు చేసిన వాహనాలను తొలగించడం, పోలీసులకు సంబంధించిన అధికారిక విధుల్లో సహకరించడం, ప్రజా భద్రతను పర్యవేక్షించడం, అధికారులు చెప్పిన పనులు చేయడం వీరి ప్రాథమిక విధుల్లో కొన్ని. కానీ సంజయ్ రాయ్ అనే వ్యక్తిని సివిల్ వాలంటీర్ గా విధుల్లోకి తీసుకున్నాడు. అతడు తనకున్న అధికారంతో ఆర్జీ కార్ ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోకి వెళ్లే అవకాశాన్ని పొందాడు. ఇదే సమయంలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడ్డాడు. అసలు ఈ వ్యవస్థ అత్యంత దారుణమైందని" సిపిఎం నేత సృజన్ చక్రవర్తి ఆరోపిస్తున్నారు." రాత పరీక్ష ఉండదు. ఇంటర్వ్యూలు కూడా ఉండవు. సివిక్ వాలంటీర్ గా పనికి వస్తాడని అధికార పార్టీ నేతల నిర్ణయిస్తారు. వారే ఒక జాబితాను విడుదల చేస్తారు. ఆ తర్వాత వారి నియామకం జరిగిపోతుంది. ఇలా ఎంపికైన వారిపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. బెంగాల్ రాష్ట్రంలో పోలీసులను కూడా నియంత్రించే స్థాయికి సివిక్ వాల్లటీర్ల వ్యవస్థ ఎదిగిందని" సృజన్ చక్రవర్తి చెబుతున్నారు.. మరోవైపు సంజయ్ రాయ్ పై గతంలో గృహహింసకేసు నమోదయిందని, కానీ అతడు సివిక్ వాలంటీర్ కావడంతో పోలీసులు అరెస్ట్ చేయలేదని సృజన్ పేర్కొన్నారు.ఇక విద్యార్థి ఉద్యమ కార్యకర్త అనిస్ ఖాన్ అనే యువకుడు 2022లో హత్యకు గురయ్యాడు. ఆ సమయంలో అతని హత్య వెనుక సివిక్ వాలంటీర్ ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆ సమయంలో ఆ వ్యవస్థను మొత్తం రద్దు చేయాలని అప్పటి అడ్వకేట్ జనరల్ గోపాల్ ముఖోపాధ్యాయ అంతర్గతంగా వ్యాఖ్యానించడం ప్రకంపనలు కలిగించింది. ఆ తర్వాత అది తన వ్యక్తిగత అభిప్రాయమని ఆయన సవరించే ప్రయత్నం చేశారు. ఇక ఇటీవల ఒక ఓ డ్రైవర్ కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సివిక్ వాలంటీర్ అతడి వద్ద నుంచి 11,370 రూపాయలు లంచంగా తీసుకున్నాడు..కోల్ కతా లోని లేక్ కాళీ బరీ ఆలయంలో వాహనాలకు పూజ చేయిస్తే కచ్చితంగా అక్కడి సివిక్ వాలంటీర్లకు కచ్చితంగా 100 లేదా 200 ఇవ్వాల్సిందే. ఇక సివిక్ వాలంటీర్లను స్వచ్ఛంద సేవకులుగా పేర్కొంటున్న ప్రభుత్వం.. హోం శాఖ నుంచి వారికి ప్రతినెల జీతాలు చెల్లిస్తోంది. వారిని పోలీసులతో కలిపి తిప్పుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతను పర్యవేక్షించేందుకు వారిని కూడా భాగం చేస్తోంది. దీనిపట్ల పోలీసులు అంతర్గతంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ..పై బాస్ లు మొత్తం అధికార పార్టీకి తొత్తులు కావడంతో ఏమీ అనలేని పరిస్థితి.. ఇలాంటి వ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్న మమతా బెనర్జీ లాంటివాళ్ళు.. దీదీ గా అభివర్ణించుకోవడం గమనార్హం. ఇదే సమయంలో బెంగాల్ ప్రజలు చేసుకున్న పాపం.

## ఘనంగా పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని తొర్తి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. బహుజనుల పోరాట యోధుడు, పీడిత జనుల ఆశాజ్యోతి, పాపన్న గౌడ్ విగ్రహాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల చిన్న గంగారాం, మాజీ సర్పంచ్ నవీన్, తుపాకుల నారాగౌడ్, సుమన్ గౌడ్, రవి గౌడ్, గోవర్ధన్ గౌడ్, రాజా గౌడ్, నాయుడు నాగన్న, కొత్త రాజన్న, కుంద సాగర్, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మతో శవయాత్ర




**వాస్తవనేస్తం,బజార్ హత్నూర్:** మండల కేంద్రం ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మకు పాడే కట్టుకొని చావు డప్పు కొడుతూ ఊరేగింపు చేస్తూ నిరసనలు తెలిపారు. ఎన్నికలప్పుడు సాధ్యం కానీ హామీ లిచ్చి రైతులను మోసపుచ్చారని రైతులు అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు హామీ మార్చారని రైతులు ఆరోపించారు. ప్రతి రైతుకు రూ.2 లక్షల పంట ఋణం మాఫీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి..

## నిందితుని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** యువకుడి పై కత్తితో దాడి చేసిన నిందితున్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చికెన్ సెంటర్స్ గల్లీలోని గుడ్ మార్నింగ్ బేకరీలోకి శనివారం రాత్రి తుమ్మల రితీష్ రెడ్డి అనే యువకుడు వెళ్లి సిగరెటు ఉద్దెర అడగగా, బేకరీ షాప్ యజమాని అయిన షేక్ జునేద్ సిగరెట్ ఇవ్వకపోవడంతో తుమ్మల రితీష్ రెడ్డి బేకరీలోని సామాను కిందపడెయ్యగా ఎందుకు పాడేస్తున్నావని బేకరీ షాప్ యజమాని అడిగాడు. వెంటనే తుమ్మల రితీష్ రెడ్డి తన తమ్ముడైన తుమ్మల సతీష్ రెడ్డి ఫోన్ చేసి పిలవగా, తుమ్మల సతీష్ రెడ్డి బేకరీ షాప్ వద్దకు వచ్చి బేకరీ పై రాళ్లు రుబ్బుతూ, బేకరీ షాప్ కొత్త ఫ్లెక్సీ తయారు చేయడం కోసం వెల్డింగ్ షాపులో పనిచేసే మినాహాజ్ కొలతల కోసం అప్పటికే వచ్చి ఉండగా తుమ్మల సతీష్ రెడ్డి వెంట తెచ్చుకున్న కత్తితో సయ్యద్ మినాహాజ్ కుడిచెవి పై దాడి చేయడంతో మినాహాజ్ కు తీవ్ర గాయాలయ్యాయి. మినాహాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## హైడ్రా... బుల్డోజర్లు..వచ్చేస్తున్నాయ్....

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆక్రమణదారులకు వణుకు మొదలయింది. "హైడ్రా" దూకుడుతో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ చెరువు స్థలాలను, ప్రభుత్వ భూములను కబ్జా చేసేసి ఆక్రమించుకుని ఆకాశహార్మ్యాలు కట్టిన బిల్డర్ల తాట తీస్తున్నారు. అక్రమ నిర్మాణం అని తేలితే చాలు వెంటనే కూల్చి వేస్తున్నారు. అక్రమంగా కట్టడాన్ని నిర్మిస్తే చాలు వాటిని కూల్చివేసేందుకు సిద్ధమయ్యారు హైడ్రా అధికారులు. హైదరాబాద్ మహానగరంలో చెరువుల భూములను, ప్రభుత్వ భూములను ఆక్రమించు కున్న వాటిని నేలమట్టం చేస్తున్నారు. ఒక్క సమాచారం ఎవరు ఇచ్చినా వెంటనే అక్కడకు వాలిపోయి కూల్చివేతలను ప్రారంభిస్తున్నారు.వానఅక్రమ నిర్మాణాలను... ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పార్క్ స్థలాలు, బఫర్ జోన్లలో అక్రమనిర్మాణాలను కూల్చి వేసేందుకు "హైడ్రా"ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్ట్ ఏజెన్సీ గా నామకరణం చేశారు. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించేందుకు ఈ సంస్థక ఛైర్మన్ గాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తారు. హైడ్రా కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ నియమితులయ్యారు. ఇక చూస్కోండి. అప్పటి నుంచి హైడ్రాకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి.వాటిని మ్యాప్ ద్వారా పరిలించి ఆక్రమణలు అన్న తేల్చుకున్న తర్వాతనే వాటినికూల్చి వేస్తున్నార.. హైడ్రా ఛైర్మన్ రేవంత్ రెడ్డికూడా ఈవిషయంలో సీరియస్ గాఉండటంతో ఆయన వద్దకు వెళ్లి పైరవీలు చే?సేందుకు అవకాశం లేదు. రేవంత్ రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆయన ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుని ఈ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. రాత్రి పన్నెండు గంటలకు మొదలెట్టి న్యాయస్థానాలను ఆశ్రయించకుండా హైడ్రా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తాజాగా బాచుపల్లిలో ఉన్న మల్టీ ఫ్లెక్స్ భవనాన్నికూల్చి వేశారు. అంతేకాదు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. దానం నాగేందర్ రంగనాథ్ పై కొంత పరుష వ్యాఖ్యలు చేసినా ఆయన పెద్దగా పట్టించుకోలేదు. సో.. మీ ప్రాంతంలో ఆక్రమణలున్నాయా? అయితే వెంటనే హైడ్రాకు ఫిర్యాదు చేయండి. ప్రభుత్వ స్థలాలు రక్షించినవారవుతారు

## క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ :** పొలిటికల్‌గా రచ్చరేపిన ఎల్ఆర్ఎస్ విషయంలో ఎట్టకేలకు ముందడగు పడింది. 2020లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేక మేడలు కాదు. ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేతల పర్వం మొదలైంది. హైడ్రా ఆపరేషన్ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.మరోవైపు లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్.. ఎల్ఆర్ఎస్ పై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లే అవుట్స్, ప్లాట్స్ క్రమబద్ధీకరణకు మరో ఛాన్స్ ఇచ్చింది. కాకపోతే కండీషన్స్ అప్లయ్. 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు సంబంధిత అధికారులు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com